
సాక్షి జోగులాంబ గద్వాల

బుధవారం ౹ 9 ౹ ఆగస్టు ౹ 2023



నమ్మించి.. నట్టేట ముంచి
ఈజీ మనీ పేరిట కేటుగాళ్లు అమాయకులను నిలువునా ముంచుతున్నారు.
వివరాలు 8లో ▸



కొనసాగుతున్న వరద
జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతుందని అధికారులు తెలిపారు.
వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /25.1

వాతావరణం
ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

ముందుచూపు లేక.. ముప్పు

- పంటలకు నీరివ్వాల్సిన సమయంలో జూరాల ప్రధాన కాల్వపై వంతెన పనులు
- నీటి విడుదలకు తప్పని తిప్పలు
- పనులు దక్కించుకున్న ఓ ముఖ్యనేత చేష్టలతో రైతుల ఇబ్బందులు
- హెడ్‌రెగ్యులేటరీ వద్ద ధర్నాకు దిగిన జూరాల ఆయకట్టుదారులు



నీటి విడుదల నిలిపివేయడంతో వట్టిపోయిన జూరాల ప్రధాన కుడికాల్వ

గద్వాల రూరల్: ముందుచూపు లేని కొందరు నేతల నిర్ణయాలతో వేలాది ఎకరాల పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. పంటలకు ఇబ్బంది లేని.. వేసవి సమయంలో చేపట్టాల్సిన జూరాల ప్రధాన కాల్వపై వంతెన పనులను నారుపోసుకున్న సమయంలో చేపడుతుండడంతో జూరాల ఆయకట్టుదారులు మండిపడితున్నారు. కాల్వకు నీరివ్వకుంటే పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏకంగా డ్యాం హెడ్‌రెగ్యులేటరీ, కలెక్టరేట్ వద్ద ధర్నాకు దిగారు. పూర్తి వివరాలిలా..

వంతెన నిర్మాణానికి రూ.1.15కోట్లు మంజూరు

గద్వాల పట్టణ పరిధిలోని నదీఅగ్రహారం వెళ్లే దారిలో జూరాల ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వపై సుమారు 35 ఏళ్ల క్రితం వంతెన (బ్రిడ్జి) నిర్మాణం చేశారు. అయితే ప్రస్తుతం ఆ వంతెన శిథిలావస్థకు చేరడంతో నూతన వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1.15కోట్లు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి గతేడాది మార్చిలో టెండర్, అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. వంతెనని



ధరూరు మండలం చింతరేవులో 40రోజుల కింద పోసిన వరినారు

ఆరు నెలల్లో పూర్తిచేయాలని పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో అధికారులు ఒప్పందం చేసుకున్నారు. అయితే పనులు దక్కించుకున్నది నియోజకవర్గంలోని ముఖ్యనేత సొంత మనుషులు కావడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు ఒప్పందం గడువు పూర్తయినప్పటికీ పనులు ఆగుతూ.. సాగుతూనే ఉన్నాయి. ఒత్తిడి చేసి పనులు పూర్తి చేయిద్దామంటే పనులు దక్కించుకున్నది ముఖ్యనేత సొంత మనుషులు కావడంతో అధికారులు కూడా వెనక్కు జంకారు. అయితే ఇటీవల పత్రికలు, మీడియాలో శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి దుస్థితిపై కథనాలు రావడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో పనులు దక్కించుకున్న ముఖ్యనేత మనుషులు ముందుచూపు లేకుండానే తాజాగా పనులు మొదలు పెట్టారు.

38వేల ఎకరాల ఆయకట్టు

జూరాల ప్రధాన కుడి కాల్వ కింద 38వేల ఆయకట్టు ఉంది. దీని కిందున్న ఆయకట్టుదారులు 40రోజుల క్రితం నారు మల్లు పోసుకున్నారు. జూరాల ప్రాజెక్టుకు వరద ఆలస్యంగా రావడంతో ఆందోళనలో ఉన్న రైతులు ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జూరాల ప్రాజెక్టుకు భారీ వరద చేరడంతో ఊరట చెందారు. అయితే వానదేవుడు కరుణించినప్పటికీ ఇక్కడున్న ముఖ్యనేత మాత్రం రైతుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ అధికారులపై బలవంతంగా ఒత్తిళ్లు తీసుకొచ్చి బ్రిడ్జికి సంబంధించిన స్లాబ్ నిర్మాణ పనులు మొదలుపెట్టారు.

నీటి బంద్‌తో రైతుల ఆందోళన

దీంతో సదరు నేతకు బెదిరి చేసేది లేక కాల్వకు నీటి విడుదల చేయకుండా అధికారులు బందుపెట్టారు. దీంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఎంతో కష్టపడి తాము వరిపంటకు అవసరమైన నారుమల్లు పోసుకుంటే సదరు ముఖ్యనేత వంతెన పనులు మొదలు పెట్టడం ఏంటని ఆయకట్టుదారులు మండిపడుతున్నారు. ధరూరు, గద్వాల మండలాల్లో కొన్ని చోట్ల ఇప్పటికే రైతులు నాట్లు వేసుకున్నారు. దీంతో తమ పంటకు సరిపడా నీళ్లు రావడం లేదని ఆగ్రహించిన రైతులు మంగళవారం జూరాల డ్యాం వద్ద హెడ్‌రెగ్యులేటరీ వద్ద ధర్నాకు దిగారు. వెంటనే కాల్వకు నీరు వదలాలని రోడ్డుపై బైటాయించారు. మరోవైపు అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సైతం రైతులతో కలిసి ఏకంగా కలెక్టరేట్ వద్ద ధర్నాచేశారు. దీంతో ఎట్టకేలకు అధికారులు దిగివచ్చారు. బుధవారం నుంచి కాల్వకు నిరాటకంగా నీటిని విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం

కొందరు బ్రిడ్జి నిర్మాణం చేయాలంటారు, **మరికొందరు వద్దం**టారు. ఇక్కడ ఏం చేద్దామన్నా అన్నింటికీ రాజకీయమే. నారుమల్ల **కోసం ప్రత్యామ్నా**యంగా జమ్ములమ్మ రిజర్వాయర్, **ధరూరు** పరిధిలోని పైభాగంలో **ప్రత్యామ్నాయ కాల్వ** ద్వారా నీటిని విడుదల చేశాం. **రేపటి నుంచి** కాల్వకు నిరంతరంగా నీటిని **విడుదల చేసి** రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తాం.

– శ్రీనివాస్‌రావు, ఎస్ఈ జిల్లా ఇరిగేషన్‌శాఖ

పంటల సమయంలో పనులా..?



కుడికాల్వ కింద నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పంట సాగుచేస్తున్నా. ఎండాకాలంలో చేయాల్సిన పనులను సరిగ్గా పంటలకు నీళ్లు వదిలేటప్పుడు ఎలా చేస్తారు. రైతుల కంటే కాంట్రాక్టర్‌కు డబ్బులే ముఖ్యమయ్యాయి. వెంటనే కాలువకు నీళ్లు వదలి పంటలు కాపాడాలి.

– బస్వలింగం, కారుపాకుల, ఇటిక్యాల మండలం

పంటలు ఎండుతున్నాయి..



నాలుగు ఎకరాల సొంత పొలం, కౌలుకు తీసుకున్న ఐదెకరాలలో మిరప నాటు వేశాను. కాల్వకు నీళ్లు సకాలంలో రాకపోవడంతో పంట ఎండుతుంది. మా కష్టాలను గుర్తించి అధికారులు వెంటనే కాల్వకు నీటిని విడుదల చేయాలి.

– లక్ష్మన్న, సాసనూలు, ఇటిక్యాల మండలం

కాల్వకు నీరివ్వకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం

- కలెక్టరేట్, జూరాల ప్రాజెక్టు వద్ద కాంగ్రెస్ నాయకులు, రైతుల ఆందోళన



ధరూరు మండలం జూరాల రోడ్డుపై ధర్నా చేస్తున్న ఆయకట్టు రైతులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గద్వాల రూరల్/ఎర్రవల్లిచౌరస్తా/ధరూరు: జూరాల ప్రాజెక్టు కుడికాల్వ కింద నాట్లు వేసి 40రోజులు గడుస్తున్నా ఇంకా కాల్వకు నీరివ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వేసవికాలం మొత్తం కాలయాపన చేసి ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడం దారుణమని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మండిపడ్డారు. మంగళవారం జూరాల రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో చేయాల్సిన పనులు చేయకుండా కమీషన్ల కోసం కాలయాపన చేసి ఇప్పుడు రైతులకు సాగుచేసిన పంటలకు నీళ్లు అవసరమైనప్పుడు బ్రిడ్జీ పనులు చేపట్టడడం తెలివితక్కువ పనంటూ ధ్వజమెత్తారు. రేపటి వరకు కాల్వవకు నీరివ్వకుంటే రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో రుక్మందర్ రెడ్డి, రవి, షేక్షావలి, నాగశిరోమణి, లాల్‌గౌడ్, వెంకటేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జూరాల ప్రాజెక్టు వద్ద బైఠాయింపు

కుడి కాల్వకు సాగు నీటిని విడుదల చేయాలని జూరాల ఆయకట్టు రైతులు ధర్నా చేపట్టారు. మంగళవారం ధరూరు మండలంలోని జూరాల ప్రాజెక్టు రహదారిపై రేవులపల్లి, భీంపురం గ్రామాల రైతులు ధర్నా చేపట్టారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఒకే ప్రాజెక్టు కింద ఉన్న ఎడమ కాలువకు సాగు నీటిని విడుదల చేస్తుండగా.. కుడి కాలువకు ఎందుకు నీళ్లు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దాదాపు గంట పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. అనంతరం ఎస్ఐ శివానందంగౌడ్ అక్కడికి చేరుకుని రెండు రోజుల్లో సాగు నీటిని విడుదల చేస్తారని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలను అర్హులకే దక్కేలా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని ఐడీవోసీ సమావేశం హాలులో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి సంబంధించి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని, వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. అదేవిధంగా వీఆర్ఏ ఉద్యోగుల సర్దుబాటుకు సంబంధించి సమగ్ర వివరాలు అందజేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో అవసరమైన చర్యలు తీసుకుని ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ధరణికి సంబంధించి భూసమస్యలను పెండింగులో ఉంచకుండా పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, ఆర్డీవో చంద్రకళ, ఎస్డీసీ సుబ్రమణ్యం, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అక్రమాలను ఎండగట్టాలి



గద్వాలలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డీకే అరుణ

గద్వాల: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని.. బీఆర్ఎస్ నేతల అవినీతి, అక్రమాలు, వైఫల్యాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. మంగళవారం గద్వాల మున్సిపల్ పరిధిలోని 9, 12వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను డీకే అరుణ ఆవిష్కరించారు. అనంతరం ఆయా కాలనీలోని ప్రజల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదని, కల్వకుంట్ల కుటుంబమే పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ కేవలం మాటలు చెప్పే ముఖ్యమంత్రి అని, క్షేత్రస్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ దౌర్జన్యాలకు, అవినీతికి చరమ గీతం పాడాలని పిలుపునిచ్చారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీజేపీ జైత్రయాత్రను ఎవరూ అపలేరని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిరంతర కృషి వల్ల దేశం అభివృద్ధిలో ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు పొందుతుందన్నారు. దేశంలో పది కోట్ల మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు లక్ష్యం పెట్టుకుని, దానిలో మూడొంతుల మందికి పంపిణీ చేసిన చరిత్ర బీజేపీకి ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు వివరించాలన్నారు. బీజేపీతోనే దేశంలో సుస్థిర పాలన సాధ్యమన్నారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, రవికుమార్, రామంజనేయులు, బండల వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ అనిత, రామలింగేశ్వర కాంళ్లే, మేడం రామకృష్ణ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం



మానవపాడులో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీఎం అబ్రహం

మానవపాడు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీసీ రోడ్డుకు భూమిపూజ, కల్యాణలక్ష్మి చెక్కుల పంపణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు పెద్దన్నలా సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని, రూ.లక్ష సాయం అందజేస్తున్నారన్నారు. అలాగే, గ్రామాల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తోందన్నారు. రైతు బంధు, రైతుబీమా, 24గంటల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, కేసీఆర్ కిట్టు, దళితబంధు, అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశంలో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా మండలంలో 26మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. సర్పంచ్ హైమావతి, తహసీల్దార్ జుబేర్ మొహిద్దీన్, డిప్యూటీ తమసీల్దార్ ధరణిషా, ఆర్ఐ రాజనీకాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్రాములు, మురళీధర్‌రెడ్డి, కాంతారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పాలకమండలి మంగళవారం హైద్రాబాద్‌లో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కలిశారు. ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్ నేతృత్వంలో పాలకమండలి సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేష్, వెంకటనారాయణ, అడవయ్య, చంద్రకళ నీలప్ప చల్లా వెంకట్రామిరెడ్డితో మాట్లాడారు. సూర్యనారాయణస్వామి, యోగనారసింహ స్వామి, కళ్యాణమండపం, ఆర్చిగేట్లు, ఆలయ భూముల సమస్య, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలతోపాటు పలు అంశాలపై చర్చించారు. కాగా ఈ అంశాలపై చల్లా సానుకూలంగా స్పందించి మరికొన్ని సూచనలు చేయడంతోపాటు త్వరలోనే సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్తానని శాశ్వత పరిష్కారానికి మార్గం చూపుతామని హామీ ఇచ్చారు.

13న క్రీడా పాఠశాలల్లో రాష్ట్రస్థాయి ఎంపికలు

గద్వాల: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, అదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 4, 5వ తరగతుల్లో ప్రవేశాలకు రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలను ఈ నెల 13న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్ తెలిపారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని హకీంపేట ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులు విధిగా రాష్ట్రస్థాయి శారీరక, సామర్థ్య ఎంపిక పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఒకరోజు ముందే హైదరాబాద్‌కు చేరుకుని స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికేట్లు, కులం, ఆదాయం పత్రాలు, ఫొటోలతో హాజరు కావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు ఆయా పాఠశాలల పీఈటీలు రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలపై అవగాహన కల్పించాలన్నారు.



స్టేడియాన్ని పరిశీలిస్తున్న డీవైఎస్ఓ ఆనంద్

ఇండోర్ స్టేడియం త్వరలో అందుబాటులోకి తెస్తాం

ఎర్రవల్లిచౌరస్తా: ఇండోర్ స్టేడియంలో అన్నివసతులను కల్పించి త్వరలోనే క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామని డీవైఎస్ఓ డాక్టర్ ఆనంద్ అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి సమీపంలో గల ఇండోర్ స్టేడియాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. స్టేడియం ఏర్పాటయ్యాక అందులో అర్బన్ గురుకుల పాఠశాల కొనసాగిందని, ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల ఇక్కడ లేకపోవడంతో విద్యార్థులకు ఆడేందుకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు. దీనికోసం స్టేడియంలోని గదులు, షటిల్ కోర్టు, మైదానాలను పరిశీలించి త్వరలోనే స్టేడియం అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఇక్కడ రానున్న ఎస్‌బీఎఫ్ క్రీడలు, మండల, జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు 200 మీటర్ల ట్రాక్ కూడా ఉన్నాయన్నారు. చిన్న చిన్న మరమ్మతులు చేపట్టి క్రీడలకు అందుబాటులోకి వచ్చేలా తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎస్‌బీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, తాయిక్వాండో రాష్ట్ర కార్యదర్శి శ్రీహరి, పుట్‌బాల్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి విజయ్, క్రికెట్ అషోషియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న ముసాయిదాబేగం

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానిని సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా సంక్షేమ అధికారి ముసాయిదా బేగం అన్నారు. మంగళవారం ఇటిక్యాల మండల పరిదిలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి వారి చదువు, సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని తెలిపారు. ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి విషయాన్ని నోట్ చేసుకొని చదివే క్రమంలో వారికి వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ లీగల్ అధికారి శివ.. విద్యార్థులకు బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, 1098, 100 హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహణ కల్పించారు. హింసకు గురవుతున్న మహిళలు 181కు ఫోన్ చేసి సహాయాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మదునాయుడు, అంగన్‌వాడి సూపర్‌వైజర్ సంధ్య, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి టీచర్లు, తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఓటుతోనే కుటుంబ పాలనకు స్వస్తి



గద్వాల అర్బన్: ఓటు అనే ఆయుధంతోనే కుటుంబ పాలనకు స్వస్తి పలికి రాజ్యాధికారంతో అభివృద్ధి, సంక్షేమం సాధించుకుందామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. దశాబ్దాలుగా నడిగడ్డ కుటుంబ పాలనకు బంధి అయిందని, అభివృద్ధి, సంక్షేమానికి దూరంగా నెట్టివేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో పాలకులకు అవినీతి, అక్రమాలపై ఉన్న చిత్తశుద్ధి అభివృద్ధి, విద్య, వైద్యంపై లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మోసపూరిత మాటలు, హామీలతో ప్రజల ముందుకు వస్తుంటారని, గత అనుభవాలను గుర్తుంచుకొని ఓటుతో రాజకీయ గుణపాఠం చెప్పాలన్నారు. ఓటు మన భవిష్యత్తుకు పునాది అని, ఓటును నోటుకు, తాయిలాలకు అమ్ముకోవద్దని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిబాబు, లవన్న, విష్ణు, తిమ్మప్ప, గోవిందు, రాము, మునెప్ప అవనిశ్రీ, ప్రేమ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తుల క్రమబద్ధీకరణకు దరఖాస్తు

గద్వాల రూరల్: నోటరీ ద్వారా కొనుగోలు చేసిన పట్టణ వ్యవసాయేతర ఆస్తులను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 84జీఓను జారీ చేసిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నోటరీ ద్వారా కొనుగోలు చేసిన ఆస్తులను క్రమబద్ధీకరించుకోవటానికి మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు నోటరీ పత్రం, లింకు డాక్యుమెంట్, ఆస్తి పన్ను రశీదు, విద్యుత్ రశీదు, నీటి వాడకం రశీదు జతపర్చాలని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలి



గద్వాల: విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించాలని విద్యాశాఖ జిల్లా సమన్వయ అధికారిణి ఎస్తేర్‌రాణి సూచించారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక బాలభవన్‌లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జాతీయ ఉద్యమంలో చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను గుర్తు చేసుకుంటూ ఈ తరం యువత కూడా చేనేత వస్త్రాధారణ చేసి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభకు పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. పోటీలలో గెలుపొందిన గద్వాల నియోజకవర్గ విద్యార్థులకు 12న, అలంపూర్ నియోజకవర్గ విద్యార్థులకు 14న బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు సుమలత, భానుప్రకాష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంచాలి

గద్వాల అర్బన్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు గడువు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 10వరకు గడువు విధించారని, సాంకేతిక కారణాలతో పని చేయడంతో ఈ గడువు సరిపోదని పేర్కొన్నారు. అర్హులందరికి గృహలక్ష్మి పథకంలో అవకాశం కల్పించాలని, దరఖాస్తు గడువును మరో నెల రోజులు పొడగించాలని తెలిపారు.

వేరుశనగ క్వింటా రూ.7,811

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు మంగళవారం 659 క్వింటాళ్ల వేరుశనగ రాగా, క్వింటాకు గరిష్టం రూ.7811, కనిష్టం రూ.4619, సరాసరి రూ. 5989 ధరలు లభించాయి. అలాగే, 6 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 5905, కనిష్టం రూ. 5902, సరాసరి ధర రూ. 5902 ధరలు వచ్చాయి.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి



నర్సింహులు (ఫైల్)

ఊటుక్కూర్: ఉపాధి కోసం వెళ్లిన వలస కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మంగళవారం అనంతపురం జిల్లా బుక్కపట్నంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని నిడుగుర్తికి చెందిన కల్లుబండి నర్సింహులు(50) మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ముసురు వర్షాలకు గ్రామంలో పనుల్లేక వారం రోజుల క్రితం తోటి స్నేహితులతో కలిసి అనంతపురం జిల్లా బుక్కపట్నంలో మేస్త్రీ పనులు చేసేందుకు వెళ్లాడు. పనులు చేస్తూ సోమవారం విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయనకు భార్య లక్ష్మి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

ఉపాధి కూలీ..



రాము(ఫైల్)

మిడ్జిల్: ఉపాధి పనుల దగ్గర ఉపాధి కూలీ సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందిన ఘటన మంగళవారం వస్పులలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని వస్పుల గ్రామానికి చెందిన కావలి రాము(65) ఉపాధి హామీ పనుల్లో భాగంగా మంగళవారం హరితహారం మొక్కలు నాటేందుకు గోతులు తీస్తుండగా సొమ్మసిల్లి పడిపోయాడు. దీన్ని గమనించిన తోటి కూలీలు చూసే సరికి అప్పటికి మృతి చెందినట్లు గుర్తించారు. బాధిత కుటుంబాన్ని ఏపీడీ జాకియాసుల్తానా, ఏపీఓ రాజేష్, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి పరామర్శించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

రాజాపూర్: బాలానగర్ మండల కేంద్రంలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాలానగర్ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. కేశంపేట మండలం నిడదవెల్లికి చెందిన కమ్రుద్దీన్(41) భార్యాపిల్లలతో 15 ఏళ్లుగా బాలానగర్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. రెండేళ్ల క్రితం భార్య ముంతాజ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ముగ్గురు పిల్లలు బంధువుల వద్ద ఉన్నారు. మంగళవారం అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫోర్జరీ సంతకంతో ఒకరికి రిమాండ్

మహమ్మదాబాద్: చెక్కుపై గ్రామ ఉపసర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసి డబ్బు డ్రా చేసిన ఘటనలో వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. నంచర్ల గ్రామానికి చెందిన మల్టీపర్పస్ వర్కర్ సందీప్‌చారి పంచాయతీ కార్మికుల వేతనాల కోసం గ్రామ సర్పంచ్ దగ్గర చెక్కు రాయించుకుని సంతకం చేయించుకున్నాడు. తర్వాత ఉపసర్పంచ్ పావని సంతకం కోసం వెళ్లగా అందుబాటులో లేదు. దీంతో అతనే చెక్కుపై ఫోర్జరీ సంతకం చేసి డబ్బు కార్మికుల అకౌంట్లో పడేలా చేశాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ఉపసర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సందీప్‌చారిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గురుకులంలోకి ప్రవేశించిన వ్యక్తికి..

అర్ధరాత్రి సమయంలో గురుకుల పాఠశాలలో ప్రవేశించి విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేసిన వ్యక్తిని మంగళవారం పోలీసులు రిమాండ్ చేశారు. కోయిలకొండ మండలం చాంద్రాస్‌పల్లికి చెందిన శ్రీను వారం రోజుల క్రితం గండేడ్‌లోని మినీ గురుకుల హాస్టల్‌లోకి అర్ధరాత్రి ప్రవేశించాడు. విద్యార్థినుల దగ్గరికి వెళ్లి కాళ్లులాగడం, గిల్లడం వంటి పిచ్చిచేష్టలు చేసి వారిని భయభ్రాంతులకు గురిచేశాడు. ఇలా రెండుసార్లు హాస్టల్లోకి ప్రవేశించి విద్యార్థినులను భయపెట్టాడు. పాఠశాల సిబ్బంది ఫిర్యాదు మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష

మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన రాములు మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. మంగళవారం ఆయనను రిమాండ్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అతనికి రెండు రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

16 రోజుల జైలు..

అడ్డాకుల: మూసాపేట మండలంలోని వేములకు చెందిన వ్యక్తికి డ్రంకెన్‌డ్రైవ్‌లో కోర్టు 16 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ కే శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన నిందితుడిని మంగళవారం మహబూబ్‌నగర్ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి అతనికి జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే వనపర్తి జిల్లా రేవల్లి మండలం గొల్లపల్లికి చెందిన బీ అనిల్‌కుమార్ ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. సోమవారం మహబూబ్‌నగర్ జుడిషియల్ సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అనిత ముందు హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ నిందితునికి ఐదు రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించారు.

నమ్మించి.. నట్టేట ముంచి

రూ.లక్షల్లో పెట్టుబడితో కోటీశ్వరులు అవుతారని మాయమాటలు

- అధిక వడ్డీ ఇస్తామంటూ నమ్మబలుకుతున్న కేటుగాళ్లు
- రూ.కోట్లతో రాత్రికి రాత్రే ఉడాయింపు
- అత్యాశకు పోయి సర్వం కోల్పోతున్న బాధితులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 7 నెలల్లో 289 కేసులు

ఈజీ మనీ.. ఇదే అస్త్రంగా కొందరు కేటుగాళ్లు అమాయకులను నిలువునా ముంచుతున్నారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టండి.. కొన్ని నెలల్లోనే కోటీశ్వరులు అవ్వండి అంటూ.. అరచేతిలోనే వైకుంఠం చూపిస్తారు. ఈ మాటలకు నిరక్షరాస్యులతోపాటు ఉన్నత విద్యనభ్యసించి ఉద్యోగాలు చేస్తున్న వారు సైతం ఇట్టే నమ్మేస్తున్నారు. కూతురి పెళ్లి.. పిల్లల చదువులు.. ఇంటి నిర్మాణం.. ఇలా ఎన్నో వాటి కోసం దాచుకున్న రూ.లక్షలు తీసుకువచ్చి వారి చేతుల్లో పెడుతున్నారు. తీరా.. రాత్రికి రాత్రే డబ్బు తీసుకున్నవారు ఉడాయించడంతో బాధితులు సర్వం కోల్పోతున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ధాన్యాన్ని మర ఆడించి తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం మిల్లులకు కేటాయించిన ధాన్యం ఇవ్వకపోగా.. అధిక ధరకు వేరే ప్రాంతాలకు విక్రయించి రూ.కోట్లలో వెనకేసుకుంటున్నారు కొందరు మిల్లర్ల యజమానులు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గడిచిన ఏడు నెలల్లో 289పైగా చీటింగ్ కేసులు నమోదయ్యాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

గద్వాల క్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు వచ్చేలా చేస్తామంటూ ప్రజలను నమ్మించి వారి నుంచి రూ.లక్షల్లో డబ్బులు తీసుకొని ఉడాయిస్తున్నారు. రూ.కోట్లు కొల్లగొడుతున్న ఇలాంటి సంఘటనలు ఇటీవల మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో చోటు చేసుకుంటున్నాయి. సైబర్ క్రైం కేసులు సైతం పెరిగిపోతుండడం ఆందోళనకరంగా మారింది. మరోవైపు కేసుల నమోదు వరకు బాగానే ఉన్నా.. విచారణ మాత్రం అనుకున్నంత వేగంగా ముందుకు సాగడం లేదనే ఆరోపణలు బాధితుల నుంచి వినవస్తోంది.

విచారణ సాగక.. ఆందోళన..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చీటింగ్ కేసుల దర్యాప్తు అనుకున్నంత వేగంగా ముందుకు సాగడం లేదు. భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడతాయని దాచుకున్న రూ.లక్షలు మోసపోవడంతో బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సిన పోలీసులపై నాయకుల ఒత్తిడి, అమ్యామ్యాలకు అలవాటు పడి అటువైపు అడుగులు వేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గద్వాల దుర్గా ఫైనాన్స్ నిర్వాహకుడిపై బాధితులు ఫిర్యాదు చేయగా.. విచారణ అధికారి భారీగా ముడుపులు తీసుకుని కేసును నీరుగార్చారన్న ఆరోపణలు వచ్చాయి. అలాగే ప్రభుత్వ ధాన్యం గోల్‌మాల్ కేసుల్లో కూడా పోలీసు సిబ్బంది విచారణ చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. సామాన్య ప్రజలు, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్న మాయగాళ్లపై నేటికీ చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో పడ్డారు. ఉమ్మడి జిల్లాలోని చీటింగ్ కేసుల పురోగతిపై మల్టీ జోన్–2 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌ను 'సాక్షి' సంప్రదించగా కేసుల దర్యాప్తుపై సంబంధిత ఎస్పీలతో మాట్లాడాల్సిందిగా వివరించారు.





గద్వాలలో సీఎంఆర్ ధాన్యం అవకతవకలపై ఫిర్యాదు చేస్తున్న సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం ప్రసాద్‌రావు (ఫైల్)

న్యాయం చేయాలి..

దుర్గా ఫైనాన్స్ ప్రైవేటు సంస్థలో 2018లో మా కుటుంబ సభ్యులం ముగ్గురం ఒక్కోటి చొప్పున రూ.5 లక్షల చీటీ వేశాం. కాలపరిమితి పూర్తయినా సంస్థ నిర్వాహకులు రేపు, మాపు అంటూ పరారయ్యారు. మోసపోయామని గుర్తించి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదు. అప్పుల ఊబిలో కూరుకుపోయాం.

– రవి, పూడూరు, గద్వాల

ఎవరినీ ఉపేక్షించం..



అధిక వడ్డీలు ఇస్తామని చెప్పే వారి మాటలు నమ్మొద్దు. అక్కడ మోసం జరుగుతుందని గ్రహించాలి. ఆర్బీఐ నిబంధనల మేరకు అనుమతి పొందిన ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల్లో నగదు జమ చేసుకోవాలి. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. ఎవరికీ ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పొద్దు. జిల్లాలో నమోదైన చీటింగ్ కేసులపై ప్రత్యేక దర్యాప్తు చేస్తున్నాం. ఎవరినీ ఉపేక్షించం.

– సృజన, ఎస్పీ, గద్వాల

ఉమ్మడి జిల్లాలో నమోదైన చీటింగ్ కేసుల వివరాలిలా..	మహబూబ్‌నగర్	వనపర్తి	నాగర్‌కర్నూల్	జోగుళాంబ గద్వాల	నారాయణపేట
	79	59	58	53	49

కొన్ని సంఘటనలు ఇలా..

➢ 20.05.2023న గద్వాల జిల్లాకేంద్రంలో రాజస్తాన్‌కు చెందిన ఓ వస్త్ర వ్యాపారి శివం ఫ్యాషన్ రెడిమేడ్ వస్త్ర వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే తెలిసిన వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీ ఇస్తానంటూ రూ.1.50 కోట్లు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో వ్యాపారులకు అప్పు చెల్లించలేక గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే ఉడాయించాడు. ఈ ఘటనపై బాధితులు గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

➢ 29.05.2023న గద్వాల జిల్లా అయిజ మండలం ఉప్పలకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అతడి బంధువులు, స్నేహితులు, తోటి ఉపాధ్యాయుల నుంచి వడ్డీ వ్యాపారం, చీటీల పేరుతో డబ్బులను నెలవారీగా వసూలు చేస్తూ వచ్చాడు. అయితే వ్యాపారంలో పెద్దమొత్తంలో నగదు సమకూరడంతో రూ.3 కోట్లతో అజ్ఞాతంలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

➢ 18.05.2023న నాగర్‌కర్నూల్ జిల్లాలోని గుడిపల్లికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కుటుంబ సభ్యుల పరిచయాలను ఆసరాగా చేసుకొని రూ.లక్షకు రూ.20 వేల వడ్డీ ఇస్తానని నమ్మబలికాడు. జిల్లావ్యాప్తంగా రూ.15 కోట్లు వసూలు చేసి పరారయ్యాడు. అయితే ఈ ఘటనపై సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు కనబడటం లేదని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేయడం గమనార్హం.



➢ 10.02.2023న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఓ రైస్‌మిల్లులో 112 వరి ధాన్యం బస్తాల్లో కంకర కలిపిన బస్తాలను మరో ప్రాంతానికి విక్రయించేందుకు తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు సదరు మిల్లు యజమానిని అదుపులోకి తీసుకొని 112 బస్తాలను సీజ్ చేశారు. మోసానికి పాల్పడిన యజమానిపై కేసు, పీడీయాక్టు నమోదు చేశారు.

➢ 12.03.2021న నారాయణపేట జిల్లాలోని మక్తల్‌లో ఏపీకి చెందిన ఓ వడ్డీ వ్యాపారి మిత్ర ఎంటర్ ప్రైజెస్ ఏజెన్సీ నిర్వహించాడు. షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడితే రూ.లక్షకు రూ.20 వేల వడ్డీ వస్తుందని నమ్మబలికి వందలాది మందితో దాదాపు రూ.100 కోట్ల డబ్బులు వసూలు చేశాడు. రాత్రికి రాత్రే చెప్పా పెట్టకుండా వెళ్లిపోయాడు. బాధితులు మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.వంద కోట్లు కావడంతో ఈ విషయం అప్పట్లో పెను సంచలనంగా మారింది.

➢ 03.04.2023న వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి తక్కువ డబ్బుకు ప్లాట్లు ఇస్తామని ప్రజలను నమ్మించారు. అక్షరగోల్డ్ రిసార్ట్స్ పేరిట వనపర్తిలో వ్యాపారం నిర్వహించారు. రూ.50 లక్షల మేర బాధితుల నుంచి డబ్బులు వసూలు చేశారు. ఈ మోసాన్ని పసిగట్టిన సీఐడీ పోలీసులు.. సమాచారాన్ని వనపర్తి పోలీసులకు చేరవేయడంతో ముఠా సభ్యులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేశారు.

➢ 27.05.2023న గద్వాల జిల్లాలో రూ.11కోట్ల విలువైన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎమ్మార్)ని పక్కదారి పట్టించిన ముగ్గురు మిల్లుల యజమానులపై చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వం 2021–22 రబీ సీజన్‌కు సంబంధించి రూ.11 కోట్ల ధాన్యాన్ని మూడు రైస్ మిల్లులకు కేటాయించింది. అయితే సదరు మిల్లు యజమానులు ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన ధాన్యాన్ని పక్కదారి పట్టించి రూ.11 కోట్లు మాయం చేశారు. దీంతో సూర్య ట్రేడర్స్, కృష్ణ రైస్ మిల్లు, అన్నపూర్ణ ట్రేడర్స్ యజమానులపై అయిజ, గద్వాల రూరల్, శాంతినగర్ పోలీస్‌స్టేషన్లలో చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వ ఖజానాకే గండికొట్టడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

➢ 2021మార్చి 10న గద్వాలలో దుర్గా ఫైనాన్స్‌లో 105 మంది సభ్యులు నెలవారీగా చీటీల రూపంలో డబ్బులు పొదుపు చేశారు. ఈ క్రమంలో ఫైనాన్స్ నిర్వాహకుడు రూ.3.45 కోట్లతో ఉడాయించాడు. దీంతో బాధితులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు కేసు విచారణ దశలోనే ఉంది.

అత్తింటికి నిప్పంటించిన అల్లుడు

ఖిల్లాఘణపురం: భార్య కాపురానికి రావడంలేదని అత్తవారి ఇంటికి అల్లుడు నిప్పు పెట్టిన ఘటన ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో సోమవారం మధ్యరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీహరి కథనం ప్రకారం.. ఖిల్లాఘణపురం గ్రామానికి చెందిన సల్కెలాపురం చిన్న భద్రయ్య, మణెమ్మ దంపతుల కూతురు లక్ష్మిని అదే గ్రామంలో పోయికాటి శివయ్యకు ఇచ్చి 14 ఏళ్లక్రితం వివాహం చేశారు. వారికి ఒక కుమారుడు పుట్టాడు. 3 ఏళ్లుగా భద్రయ్య అనారోగ్యంతో ఉన్నాడు. ఈ క్రమంలో లక్ష్మికి శివయ్యకు మధ్య గొడవ జరిగింది. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రుల దగ్గరే ఉంటోంది. భార్య కాపురానికి రావడం లేదని తరుచుగా అత్తగారి ఇంటికెళ్లి శివయ్య గొడవ పడేవాడు. సోమవారం మధ్యరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటిపై పెట్రోల్ పోసి అత్తవారి ఇంటికి శివయ్య నిప్పు పెట్టాడు. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పెద్ద ఎత్తున పొగరావడంతో చుట్టుపక్కల వారు చూసి వనపర్తి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు.



మంటల్లో కాలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీహరి

ఫైరింజన్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. లక్ష్మి తల్లి మణెమ్మ ఫిర్యాదు మేరకు శివయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ విషయం తెలిసిన తర్వాత సర్పంచ్ వెంకటరమణ బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సహాయం చేసి పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ళకృష్ణయ్య, జెడ్పీటీసీ సామ్యనాయక్, నాయకులు వెంకటేష్, ఆంజనేయులు, బాల్‌రెడ్డి, బుచ్చిబాబుగౌడు రూ.7 వేల సాయం అందజేశారు.

మహిళ దారుణ హత్య

- బండరాయితో తలపై మోదిన కొడుకు

మహమ్మదాబాద్: అక్క రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఇద్దరు పిల్లల ఆలనా పాలన చూసుకునేందుకు భార్య చెల్లిని ఓ వ్యక్తి రెండో పెళ్లి చేసుకున్నాడు. దీంతో ఆమె అక్క పిల్లలను తన సొంత బిడ్డలుగా పెంచి పెద్ద చేసింది. కొడుకే వెంబడించి బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేసిన ఘటన మంగళవారం జూలపల్లి పెద్దతండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహమ్మదాబాద్ మండలంలోని జూలపల్లి పెద్దతండాకు చెందిన మూడావత్ లోక్యకు 30 ఏళ్ల క్రితం అన్నారెడ్డిపల్లి తండాకు చెందిన మాణిబాయితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు పుట్టారు. అనంతరం ఓ ప్రమాదంలో మాణిబాయి మృతి చెందింది. పిల్లల ఆలనాపాలన చూసేందుకు ఎవరూ లేకపోవడంతో తన భార్య సొంత చెల్లెలు ముడావత్ లక్ష్మి(32)ని రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో ఆమె ఇద్దరు పిల్లలను తన పిల్లలుగానే పెంచి పెద్ద చేసి, మంచి చదువులు చదివించింది. భార్యాభర్తలు, కుటుంబీకులంతా పూనేలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు పిల్లలు అనిల్, అతని అన్న హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నారు. పూనేలో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేస్తూ, మహబూబ్‌నగర్‌లో కూడా కాంట్రాక్టు పట్టుకుని భవనాలను కట్టిస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తలు పూనే నుంచి వారం రోజుల క్రితం స్వగ్రామం జూలపల్లి పెద్దతండాకు వచ్చారు. మంగళవారం లోక్య పని మీద మహబూబ్‌నగర్ వెళ్లాడు. ఈ సమయంలో అనిల్ పొలం దగ్గరున్న గుడికి వెళ్లొస్తానని పోయాడు. అక్కడి వెళ్లిన తరువాత చిన్నమ్మ లక్ష్మిని రమ్మని పిలిపించుకున్నాడు. అక్కడికొచ్చిన చిన్నమ్మను చంపుతానని బెదిరించి వెంబడించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి అనిల్ దగ్గర ఫోన్ లాక్కుని పరుగెత్తుతూనే ఆమె భర్తకు ఫోన్ చేసింది. ఆమెను అక్కడి నుంచి పారిపొమ్మని లోక్య ఫోన్‌లో చెప్పాడు. ఆలోపే వెంబడిస్తూ వచ్చిన అనిల్ ఆమెను పట్టుకుని కింద పడేసి తలపై బండరాయితో కొట్టి చంపాడు. తన ఫోన్‌ను అక్కడే పగులగొట్టి అతని దుస్తువులను అక్కడే వదిలేసి నిక్కరుతోనే వెళ్లాడు. పక్కపాలం వారి వద్ద ఫోన్ తీసుకుని తండ్రికి ఫోన్ చేసి అమ్మ చనిపోయిందని చెప్పాడు. అక్కడి నుంచి వారి ఫోన్ తీసుకొని పారిపోయాడు. ఈ విషయం సాయంత్రం పోలీసులకు తెలియడంతో సీఐ స్వామి, ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. నిందితుడు దేనికోసం చిన్నమ్మను చంపాడనే పలు కోణాల్లో వివరాలు సేకరిస్తూ, అతన్ని వెతికే పనిలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



లక్ష్మి (ఫైల్)

భాస్వరంతో నేలకు పోషకాలు

అలంపూర్: భూమికి భాస్వరం ముఖ్యమైన పోషకం. ప్రకృతి సిద్ధంగా లభించే గాలి, నీరులానే మొక్కకు కావాల్సిన 16 రకాల పోషకాలు సాగు భూమి ద్వారా లభ్యమవుతాయి. వీటిలో నత్రజని, భాస్వరం పోషకాలు తక్కువ పరిమాణంలో, పొటాష్ ఎక్కువ పరిమాణంలో ఉంటుంది. ఈ పోషకాలు ఇసుక భూములు, మధ్యస్థ నేలలు, ఎర్రగరప నేలలు, నల్లరేగడి భూముల్లో తక్కువ శాతం ఉండే అవకాశాలు ఉన్నాయి. పోషక పదార్థాల లభ్యత నేల రకాన్ని బట్టి నేల భౌతిక స్థితి, రసాయన లక్షణాలు, సూక్ష్మ జీవుల చర్య, వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. భాస్వరం యొక్క ప్రాముఖ్యతను ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు వివరించారు.

కరగని రూపంలో బాస్వరం..

సాగవుతున్న భూముల్లో 60 శాతం కంటే ఎక్కువగా ఉన్న భాస్వరం పోషకం కరగని డై క్యాల్షియం, ట్రై క్యాల్షియం పాస్ఫేట్ రూపంలో ఉంటుంది. తేలిక భూముల్లో కంటే బరువు నేల (వరి పండించే డెల్టా భూములు)ల్లో భాస్వరం పోషకం ఎక్కువ శాతం మొక్కలకు అందుబాటులో లేని రూపంలో ఇమిడీకృతమై దాగి ఉంది. ఈ నేలల్లో భాస్వరం వినియోగ సామర్థ్యం తక్కువేనని చెప్పొచ్చు. రైతులు వాడే భాస్వరపు ఎరువుల్లోని బాస్వర పోషకం మోనో కాల్షియం పాస్ఫేట్ రూపంలో ఉంటుంది. ఇది పూర్తిగా నీటిలో కరుగుతుంది. కరిగిన వెంటనే నేలలోని అల్యూమినియం, ఐరన్ ఆక్సైడ్‌లతో క్యాల్షియం, మెగ్నీషియం కార్బోనేట్లతో రసాయన చర్య జరుగుతుంది. దీని ఫలితంగా అల్యూమినియం ఫాస్ఫేట్, మెగ్నీషియం పాస్ఫేట్లుగా మారుతాయి. ఇవి కరగని రూపంలో ఉండి తర్వాత భూమిలోని సూక్ష్మజీవుల చర్యల వలన మొక్కకు అందుబాటులోకి వస్తాయి.

ఏ దశలో వేయాలి

- భాస్వరం ముఖ్యంగా వేరు వ్యవస్థను అభివృద్ధి పరుస్తుంది.



వరిలో భాస్వర లోపం



మొక్కజొన్నలో భాస్వర లోపం

- వరి పంటలో నాట్లకు ముందు మురుగు దమ్ము చేసేటప్పుడు సింగిల్ సూపర్ ఫాస్ఫెట్ 75–100 కిలోలు, 20 కిలోల యూరియా కలిపి తప్పని సరిగా వేయాలి. లేదా వరి నాటిన తర్వాత 10 రోజులకు డీఏపీ ప్లస్ యూరియా లేక ఇతర బాస్వరం పోషకం కలిగిన కాంప్లెక్స్ ఎరువులు వేసుకోవాలి.
- వర్షాధార మెట్ట పంటలకు పత్తి, వేరుశనగ, మొక్కజొన్న మొదలగు పంటలకు ఆఖరి దుక్కిలో వేయాలి.
- రైతులు అవసరం లేకున్నా ముఖ్యంగా వరి పంటకు భాస్వరం ఎరువుల్ని రెండు మూడు పర్యాయాలు వాడుతున్నారు.

ప్రాముఖ్యం..

- భాస్వరాన్ని లవణాల రూపంలో మొక్కలు తీసుకుంటాయి.
- పూలు, విత్తనాలు, దుంపలు తదితర ఆర్థిక ప్రాముఖ్యత గల పంటల్లో విత్తనపు భాగాల్లో ఈ పోషకం అవసరం ఎక్కువే.
- భూమిలో సేంద్రియ ఎరువులు బాగా కుళ్లటకు దోహదపడుతుంది.
- పంట త్వరగా పక్వానికి రావడానికి ఉపయోగపడుతుంది.
- కణ విభజన, పైరు అభివృద్ధి మొక్క తొందరగా నిలదొక్కుకోవడం, మొక్కలో మాంసకృతులు, ఎంజైముల తయారీకి ఉపయోగపడుతుంది.
- భాస్వరం తగినంత ఉంటే నత్రజని ఎక్కువైన పైర్లకు కలిగే దుష్ఫలితాలను కొంత మేరకు అరికడుతుంది.
- మొక్కలకు అవసరమైన పిండి పదార్థం తయారు చేసుకునే కిరణజన్య సంయోగక్రియలో కీలకపాత్ర పోషిస్తుంది.
- మొక్కల ఉచ్వాస, నిశ్వాలకు నైట్రోజన్ వాడకం, ఎంజైములు ఉత్పత్తిలో పాస్పరస్ అవసరం. ఈ మూలకం లోపిస్తే మొక్కల వేర్ల పెరుగుదల బలహీనమవుతాయి.
- పైరులో పెరుగుదలతోపాటు పిలకలు పెట్టె శక్తి క్షీణిస్తోంది.
- పైరు పూతకు రావడం ఆలస్యమై దిగుబడులు ఘణనీయంగా తగ్గుతాయి.
- భాస్వరం లోపించిన పత్ర హరితం(క్లోరోఫిల్) ఏర్పడకపోవడం వలన ముదురు ఆకుపచ్చ రంగులో ఆకులు కనబడతాయి.
- మొక్కలు వాతావరణం నుంచి బొగ్గపులుసు వాయువును తీసుకుని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.
- మొక్కలు వాటి తొలిదశలో ఎదిగే భాగాల్లో భాస్వరం అందుబాటులో ఉండటం చాలా అవసరం.
- ఆమ్ల, క్షార భూముల్లో భాస్వరం సరిగా అందుబాటులో ఉండదు.
- సాగు నేలల్లో భాస్వరం అధికమైన జింకు లోపం వస్తుంది.

ఏ మేరకు వాడాలి

మట్టి నమునాల్లో భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే సాగులో ఉన్న వివిధ పంటలకు ఎంత భాస్వరం అవసరమో తెలుస్తుంది. దీన్ని బట్టి పశువుల ఎరువులు, పచ్చి రొట్టె ఎరువులు, జీవన ఎరువులు, రసాయన ఎరువుల ద్వారా భాస్వరాన్ని అందజేయాలి. సింగిల్ సూపర్ ఫాస్ఫెట్ డీఏపీ, ఎన్‌పీకే కాంప్లెక్స్ ఎరువులు తదితర వాటి ద్వారా భాస్వరాన్ని అందజేయవచ్చు.

రుణం పేరుతో మోసం

బల్మూర్: రుణం ఇస్తామని ఫోన్‌లో నమ్మబలికి డిపాజిట్ పేరుతో డబ్బులు కాజేసిన ఘటన మండలంలోని కొండనాగులలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొండనాగులకు చెందిన శేఖర్‌కు వారం రోజుల క్రితం ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేశాడు. ఇండియా బుల్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామని, శేఖర్ అకౌంట్‌కు రూ.1.20 లక్షల రుణం తీసుకోవడానికి అర్హులైనట్లు తెలిపాడు. అకౌంట్‌లో డబ్బులు వేయాలంటే రూ.4500 డిపాజిట్‌గా ఫోన్ పే చేయాలని సూచించాడు. దీంతో అజ్ఞాత వ్యక్తి ఫోన్ నంబర్‌కు శేఖర్ ఫోన్ పే చేశాడు. వారం రోజులు గడిచినా తన అకౌంట్‌లోకి డబ్బులు రాకపోగా, అజ్ఞాత వ్యక్తి ఫోన్ నెంబర్‌కు పని చేయడం లేదు. దీంతో మోసపోయానని గుర్తించి బాధితుడు మంగళవారం బల్మూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా...



169 మందికి తహసీల్దార్లుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో నాయబ్ తహసీల్దార్లుగా పనిచేస్తున్న 169 మందికి తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్‌మిత్తల్ అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన శాఖా పదోన్నతుల కమిటీ (డీపీసీ)లో నిర్ణయం తీసుకున్నారు. 2016–17 ప్యానెల్ సంవత్సరానికి సంబంధించిన పదోన్నతులకు ఈ కమిటీ ఆమోద ముద్ర వేసింది. కాగా పదోన్నతులు కల్పించడం పట్ల తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్ రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మన్నె ప్రభాకర్, ఉపాధ్యక్షులు కె.నిరంజన్, రమేష్ పాక తదితరులు మిత్తల్‌ను సచివాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

'అజయ్ టు యోగి ఆదిత్యనాథ్' పుస్తకావిష్కరణ



సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లో ప్రాచుర్యం పొందిన బొమ్మల కథ 'అజయ్ టు యోగి ఆదిత్యనాథ్'పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ఇంజనీర్స్ ఇండియా భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, రాజ్యసభ సభ్యుడు జాఫర్ ఇస్లాం, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షాజియా ఇల్మీ, చిలుకూరు బాలాజీ దేవాలయ పూజారి సీఎస్ రంగరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ జీవిత చరిత్రపై గతంలో ప్రముఖ రచయిత శంతను గుప్తా 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్', 'ది మాంక్ హూ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఉత్తరప్రదేశ్'అనే రెండు బెస్ట్ సెల్లింగ్ నవలలు రాశారు. ఈ సందర్భంగా రచయిత విలేకరులతో మాట్లాడుతూ 'ఆరుగురు తోబుట్టువులతో జన్మించిన అజయ్ సింగ్ బిష్త్ అనే కుర్రాడు.. అజయ్ గోరఖ్‌నాథ్ మఠానికి చెందిన మహంత్‌గా, తర్వాత పార్లమెంటులో అతిపిన్న వయస్కుడైన సభ్యుడిగా, చివరికి యూపీ సీఎంగా ఎలా ఎదిగాడు అనేదే ఈ పుస్తకం'అని తెలిపారు.

ఆదుకోవడం అంటే ఇలా..

లంక గ్రామాల వరద బాధితులతో ఏపీ సీఎం వైఎస్ జగన్

- నాడు ఫొటో సెషన్‌లా నేతల పర్యటన
- బాధితుల వద్దకు నేరుగా వెళ్లి మాట్లాడేవారు కాదు
- నేడు తక్షణ సాయం అందించాకే జనం మధ్యకు వస్తున్నా

సాక్షి అమలాపురం: 'గతంలో చాలాసార్లు వరదలు వచ్చాయి. నాయకులు అప్పటికప్పుడు రావడం, అధికారులంతా వారి చుట్టూ తిరగటం జరిగేది. పేపర్లలో.. టీవీల్లో ఫొటోల కోసం పోజులిచ్చి వెళ్లిపోయేవారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి. కానీ వారు మంచి జరిగిందా లేదా అని చూడలేదు. మన ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని మార్చాం. ప్రతి బాధితునికి సాయం అందుతోంది. నాలుగేళ్లుగా ఈ మార్పు కనిపిస్తోంది. సాయం చేయడం, ఆదుకోవడం అంటే ఇదీ..'అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గోదావరి వరదల బారిన పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గురజాపులంక, లంకాఫ్ ఠాన్నేల్లంక, కొండుకుదురులంకల్లో బాధితులతో మమేకమయ్యారు. వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటి ప్రతి సందర్భంలో కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలకు తక్షణ సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు కావాల్సిన డబ్బులు వారి చేతుల్లో పెట్టామని చెప్పారు. వరద నష్టం ఎక్కువా, తక్కువా అని చూడకుండా బాధితులను ఉదారంగా ఆదుకోండని చెప్పామని తెలిపారు. 'ఆయా జిల్లాల్లో కలెక్టర్లకు వారం రోజుల సమయం ఇచ్చాం. ప్రతి గ్రామంలోకి వెళ్లాలని, ప్రతి గ్రామంలో ఉన్న వ్యవస్థను చైతన్యం చేయాలని చెప్పాం. ఆ తర్వాత నేను స్వయంగా వచ్చి బాధితులకు సాయం అందిందీ లేనిదీ చూస్తానని చెప్పాను. నేను వచ్చినప్పుడు నాకు సహాయం అందలేదని ఏ ఒక్కరి నోటి నుంచి రాకూడదు'అని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని చెప్పారు. వరదలు వచ్చినప్పుడే మిమ్మల్ని పలకరించేందుకు వస్తే సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందని భావించే ఇలా చేశానని వివరించారు. కష్టాలలో ఉన్నప్పుడు మీ బిడ్డ వేగంగా ఆదుకుంటాడని పునరుద్ఘాటించారు.



అంబేడ్కర్ కోనసీమ జిల్లా గురజాపు లంకలో వరద తాకిడికి గురైన ఓ ఇంట్లోకి వెళ్లి పరిశీలించి.. బాధితురాలికి భరోసా ఇస్తున్న ఏపీ సీఎం జగన్

నేరుగా జనం మధ్యకే..

మంగళవారం ఉదయం సీఎం వైఎస్ జగన్ నేరుగా గురజాపులంకకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ఇలా గోదావరి మధ్యన ఉన్న లంక గ్రామాలకు నేరుగా వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ కావడం విశేషం. సాధారణంగా వరదల సమయంలో బాధితులను పరామర్శించేందుకు గతంలో చాలా మంది ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు జిల్లాకు వచ్చారు. అప్పట్లో డివిజన్ కేంద్రమైన అమలాపురం, వరద ప్రభావిత ప్రాంతాల మండల కేంద్రాలలో వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ఎంపిక చేసిన బాధితులను పరామర్శించి వెనుదిరిగేవారు. సీఎం జగన్ ఇందుకు భిన్నంగా నేరుగా లంక గ్రామాలలోనే దిగడం.. బాధితులను, పంట నష్టపోయిన రైతులను పరామర్శించడంతోపాటు జరిగిన నష్టాన్ని స్వయంగా వీక్షించడం గమనార్హం. ఐదారు గంటలపాటు లంక వాసులతో సీఎం మమేకమయ్యారు.

వరదలొస్తే ఏం చేయాలి?

- ఒడిశా, యూపీ, అసోం విధానాల అధ్యయనానికి టెక్నికల్ కమిటీ
- గంగా, బ్రహ్మపుత్ర, మహానది నదుల వరద నివారణ చర్యల పరిశీలన
- కమిటీ నివేదిక ఆధారంగా గోదావరి వరదలపై సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణం, పరిసర గ్రామాలకు రక్షణ కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహానది, గంగా, బ్రహ్మపుత్ర నదుల వరదల నుంచి లోతట్టు ప్రాంతాలకు రక్షణ కల్పించేందుకు అక్కడ అవలంబిస్తున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఈ నెల 16 నుంచి 18 వరకు ఒడిశాలోని మహానది, 20 నుంచి 22 వరకు అస్సాంలోని బ్రహ్మపుత్ర, 29–31 వరకు ఉత్తరప్రదేశ్‌లోని గంగా నదిని సందర్శించి వరద రక్షణ చర్యలను పరిశీలించనుంది. ప్రధానంగా వరద రక్షణ గోడలు నిర్మించాలా? లేక ఇంకేమైనా ప్రత్యామ్నాయాలు ఉన్నాయా? అన్న అంశంపై దృష్టి పెట్టనుంది. వరద రక్షణ గోడల వల్ల ఫలితాలతోపాటు వచ్చే సమస్యలను సైతం కమిటీ అధ్యయనం చేయనుంది. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో రెండు వైపులా గోడలు నిర్మించి స్థానికులకు రక్షణ కల్పించాలని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. భద్రాచలం ఆలయం, పర్ణశాల, మణుగూరు భారజల ప్లాంట్ వంటి ముఖ్యమైన కట్టడాలకు మాత్రమే వరద రక్షణ గోడలు నిర్మించాలని, మిగిలిన ముంపు ప్రాంతాల్లోని ఆవాసాలు, గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వరద రక్షణ గోడలకు ప్రత్యామ్నాయంగా ఇతర రాష్ట్రాలు తీసుకున్న చర్యలను టెక్నికల్ కమిటీ పరిశీలించనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా భద్రాచలం వరద రక్షణ గోడల ప్రాజెక్టుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

వరదల్లో 49 మంది మృతి

హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం మరో నివేదిక

సాక్షి, హైదరాబాద్: పది రోజుల క్రితం కురిసిన వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో 49 మంది మరణించినట్టు ప్రభుత్వం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. ఇందులో నలుగురు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మరణించారని పేర్కొంది. గత వారంలో ఒక నివేదిక అందజేయగా, ఇప్పుడు మరో నివేదిక అందజేసింది. 'మృతుల కుటుంబానికి రూ.4 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాం. వరదసాయానికి రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వరద తీవ్రత ఎక్కువ ఉన్నందున రెండు హెలికాప్టర్లు, 27 పడవల్ని అందుబాటులో ఉంచాం. 655 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 177 షెల్టర్లు ఏర్పాటు చేసి 12 వేలమందికి ఆశ్రయం కల్పించాం. 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, రెండు హెలికాప్టర్లు, రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల శాఖలు వరద బాధితులకు అండగా నిలిచాయి. మొత్తం 548 రోడ్లు దెబ్బతినగా.. వీటిలో 471 రాష్ట్ర రహదారులుండగా, 181 రోడ్లకు మరమ్మతులు జరిగాయి. 774 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వచ్చింది. 721 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చేశాం. రోడ్ల మరమ్మతులు, విద్యుత్ వంటివాటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నాం'అని రాష్ట్ర విపత్తుల కమిషనర్ బొజ్జా రాహుల్ హైకోర్టుకు తెలియజేశారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మధ్యంతర అప్లికేషన్(ఐఏ) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

మూలధన వ్యయంలో అగ్రభాగాన ఏపీ

ఆస్తుల కల్పన వ్యయంలో అగ్రపథంలో ఆంధ్రప్రదేశ్.. 3 నెలల్లో 40 శాతం వ్యయం



సాక్షి, అమరావతి: ఆస్తుల కల్పనకు ఉద్దేశించిన మూలధనం వ్యయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూలధన వ్యయంపై కాగ్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 40.79 శాతం వ్యయం చేసినట్లు కాగ్ గణాంకాలు తెలిపాయి. దేశంలో మరే రాష్ట్రంలోనూ తొలి త్రైమాసికంలో ఇంత మేర వ్యయం చేయలేదని కాగ్ గణాంకాలు పేర్కొన్నాయి. పలు రాష్ట్రాలు బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో ఎంతమేర ఖర్చు చేశాయనే అంశాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక కూడా వెల్లడించింది. మూలధన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ చేసినంత వ్యయం దేశంలో మరే రాష్ట్రంలోనూ చేయలేదని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. బడ్జెట్‌లో మూలధన వ్యయానికి చేసిన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్, మే నెలల్లోనే ఏకంగా 29.70 శాతం వ్యయం చేసిందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికానికి సంబంధించి కాగ్ గణాంకాలు కూడా మూలధన వ్యయంలో ఆంధ్రప్రదేశ్ మిగతా రాష్ట్రాల కన్నా ముందంజలో ఉన్నట్లు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మూలధన వ్యయం కింద రూ.31,061 కోట్లు కేటాయింపులు చేయగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.12,669 కోట్లు వ్యయం చేసిందని, ఇది కేటాయింపుల్లో 40.79 శాతమని కాగ్ గణాంకాలు స్పష్టం చేశాయి. ఆంధ్రప్రదేశ్ తరువాత మూలధన కేటాయింపుల్లో ఎక్కువ వ్యయం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, మహారాష్ట్ర ఉన్నాయి. మూలధన వ్యయం అంటే నేరుగా ఆస్తుల కల్పన వ్యయంగా పరిగణిస్తారు.

బధిరులకు డిగ్రీ కాలేజీ ఏర్పాటు యోచన

వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో బధిర విద్యార్థులకు ప్రత్యేకంగా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశించారని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం మలక్‌పేట్‌లోని తన కార్యాలయంలో ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేందర్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. బధిరుల డిగ్రీ కాలేజీ ఏర్పాటుతోపాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ...డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం పరిశీలన బృందం చేసిన ప్రతిపాదనలపై వీలైనంత త్వరగా నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రాష్ట్రంలో బధిరులకు కళాశాల లేనందున వారు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బధిర విద్యార్థుల కళాశాల ఏర్పాటు కోసం గతంలో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందించామని, దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మొబైల్ ఫోన్ రికవరీలో తెలంగాణ టాప్

సాక్షి, హైదరాబాద్ : చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల జాడ కనిపెట్టడంలో దేశంలోనే తెలంగాణ పోలీసు నంబర్‌వన్‌గా నిలిచారు. మొత్తం 67.98% రికవరీతో మొబైల్‌ఫోన్ల జాడను కనిపెట్టి వాటిని సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్‌ఫోన్లను రికవరీ చేసేందుకు టెలికమ్యూనికేషన్స్ విభాగం రూపొందించిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీసు శాఖలు వినియోగిస్తున్నాయని, ఈ పోర్టల్‌ను ఉపయోగించి మొబైల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీస్ విభాగం తొలిస్థానంలో నిలిచిందని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20 నుంచి ఆగస్టు 07 వరకు మొబైల్ ఫోన్ల చోరీ, పోగొట్టుకోవడంపై తెలంగాణ పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు 5,038 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ తర్వాత కర్ణాటక 54.20% రెండో స్థానంలో, 50.90%తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిలిచినట్లు మహేశ్ భగవత్ పేర్కొన్నారు.

వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక చర్యలు




మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో సంచరించే వన్యప్రాణులకు అటవీశాఖ తరఫున తగిన రక్షణ కల్పించాలని అడిషనల్ పీసీసీఎఫ్ కంప లోకేష్ జస్వాల్ ఐఎఫ్‌ఎస్ అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం మన్ననూర్, అమ్రాబాద్, దోమలపెంట రేంజ్ పరిధిలోని పులాయిపల్లి, దేవునిసరిహద్దు, ఈర్లపడేల్ తదితర బేస్ క్యాంపులను సందర్శించారు. అటవీ పరిసరాల్లో అధికారులు, సిబ్బందితో కలిసి గ్రాస్ ల్యాండ్, వన్యప్రాణులకు తాగు నీటి కోసం సోలార్ సిస్టమ్‌తో ఏర్పాటు చేసిన నీటి నిల్వలను పరిశీలించారు. అటవీ పరిసర ప్రాంతంలోని వృక్షసంపదను చూసిన ఆయన ఒకింత సంతోషం వ్యక్తంచేశారు. అదేక్రమంలో వన్యప్రాణుల సంరక్షణ విషయంలో కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మన్ననూర్‌లోని అటవీ శాఖ చెక్‌పోస్టు వద్ద కొత్తగా నిర్మించిన ఎఫ్‌డీఓ క్వార్టర్‌ను ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజతో పాటు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ విశాల్, శ్రీనివాసులు, ఎఫ్ఆర్ఓ ఈశ్వర్, డీఆర్ఓ రవి కుమార్, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

గొర్రెల మందలో చొరబడిన మొసలి



మక్తల్: గొర్రెల మందలో మొసలి చొరబడిన ఘటన మంగళవారం మండలంలోని కాట్రేవపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కాట్రేవపల్లికి చెందిన గొర్రెల కాపరి పరందాములు గొర్రెల మందను భూత్పూర్ రిజర్వాయర్ సమీపంలో ఆపారు. మంగళవారం తెల్లవారు జామున గొర్రెల మంద దగ్గరికి మొసలి రావడంతో అక్కడున్న కుక్కలు మెరిగాయి. దీంతో నిద్రలో ఉన్న గొర్రెల కాపరి లేచి మొసలిని చూసి గ్రామస్తులకు తెలిపాడు. గొర్రెల మంద యజమాని అంజప్ప ఫారెస్ట్ అధికారి నీలేష్‌కు సమాచారం అందించాడు. గ్రామస్తులు మొసలిని తాళ్లతో కట్టి పడేశారు. అధికారులు అక్కడికి చేరుకొని మొసలిని తీసుకెళ్లి జూరాల డ్యాంలో వదిలేశారు.

జూరాలకు కొనసాగుతున్న వరద



జూరాల జలాశయంలో నీటి నిల్వ

- 5 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి
- నెట్టెంపాడుకు కొనసాగుతున్న నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 8 గంటలకు 74 వేల క్యూసెక్కులు ఉండగా.. మంగళవారం సాయంత్రానికి 55 వేల క్యూసెక్కులకు తగ్గింది. ఉదయం 9 గంటలకు 70 వేల క్యూసెక్కులు ఉండగా.. 10 క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు ఇంకా కాస్త తగ్గడంతో 5 క్రస్ట్ గేట్లను మూసివేశారు. మరో 5 గేట్ల ద్వారా 20,410 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. రాత్రి 7 గంటల సమయంలో 55 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఇందుకుగాను 36,476 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 139 క్యూసెక్కులు, నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాల్వకు 640 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.710 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

113.393 ఎంయూ విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. మంగళవారం ఎగువ కేంద్రంలో 5 యూనిట్ల నుంచి 200 మెగావాట్లు, 55.748 మి.యూ. ఉత్పత్తి చేయగా.. దిగువలో ఆరు యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 57.645 మి.యూ. విద్యుదుత్పత్తి చేసినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 113.393 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరిగిందని వివరించారు.

రామన్‌పాడుకు 685 క్యూసెక్కులు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయానికి మంగళవారం జూరాల ఎడమ కాల్వ నుంచి 685 క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. ఎన్టీఆర్ కాల్వకు 950 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.


కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో..

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం నిలకడగా ఉంది. జూరాల ఎత్తిపోతల పథకం ద్వారా 315 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టుకు వస్తున్న నీటికి సమానంగా కుడి, ఎడమ కాల్వలకు వదులుతుండటంతో నీటిమట్టం నిలకడగా ఉన్నట్లు అధికారులు వివరించారు.

శ్రీశైలంలో 863.3 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 863.3 అడుగుల నీటిమట్టం, 116.3528 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో జూరాల స్పిల్‌వే ద్వారా 20,410, విద్యుదుత్పత్తి చేస్తూ 36,704 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. 24 గంటల వ్యవధిలో భూగర్భ కేంద్రంలో 6.873 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేసి 13,513 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 0.308 మి.యూనిట్ల ఉత్పత్తి చేసి 565 క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,977 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 333 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

కేఎల్ఐ నుంచి నీటి విడుదల..



కేఎల్ఐ మొదటి లిఫ్ట్ నుంచి విడుదలవుతున్న నీరు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరు సమీపంలో ఉన్న కేఎల్ఐ నుంచి నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు డీఈ లోకిలాల్ మంగళవారం తెలిపారు. 1, 2 పంపుల నుంచి నాలుగు రోజులుగా నీటి పంపింగ్ కొనసాగుతుండగా.. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మంగళవారం 4వ పంపును కూడా ప్రారంభించినట్లు వివరించారు. రిజర్వాయర్లన్నీ నింపే వరకు మూడు పంపుల ద్వారా విడుదల చేస్తామన్నారు.

ఇజ్రాయిల్‌లో పండ్ల తోటల పరిశీలన

మదనాపురం: తెలంగాణలో తక్కువ పెట్టుబడితో మేలి రకం పండ్ల తోటలు, కూరగాయలు పండించేందుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయడానికి రాష్ట్రం నుంచి 29 మందితో అధ్యయన బృందం ఇజ్రాయిల్‌లో పర్యటిస్తోంది. మంగళవారం లీచి, అవకాడో పండ్ల సాగు విధానాన్ని పరిశీలిస్తున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి కే సురేష్ తెలిపారు. ఈనెల 5వ తేదీన ఇజ్రాయిల్ దేశానికి బయలు దేరారు. 11న తిరిగి రాష్ట్రానికి రానున్నారు. ఇజ్రాయిల్‌లో ఉద్యాన పంటలు, పళ్ళ తోటలు, కూరగాయలు ఏ విధంగా పండిస్తున్నారు. సాగు చేసే విధానం పై అక్కడి వ్యవసాయ అధికారులతో కలిసి అధ్యయనం చేస్తున్నారు. తెలంగాణలో సరిపడే పండ్ల తోటలు, కూరగాయలపై అవగాహన పెంచుకొని రాష్ట్రంలో అమలు చేసేందుకు బృందం సభ్యులు నివేదిక ఇవ్వనున్నారు. ఐఏఎస్ హనుమంత్‌రావు, మరో ఐఏఎస్ హనుమంతు గిందాగే బృందానికి నాయకత్వం వహిస్తున్నారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, వ్యవసాయ సహాయ కమిషనర్లు, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన అధికారులు ఈ బృందంలో ఉన్నారు. ఈ 29 మంది అధ్యయన బృందంలో జిల్లా ఉద్యానవన అధికారి ఎంపిక కావడం విశేషం.



ఇజ్రాయిల్‌లో పర్యటిస్తున్న రాష్ట్ర అధ్యయన బృందం సభ్యులు

దేశాన్ని కాపాడుకుందాం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

- ఆక్రోశం సభలో మహిళా వక్తల పిలుపు

స్టేషన్ మహబూబ్‌నగర్: విద్వేషా రాజకీయాల నుంచి దేశాన్ని కాపాడుకుందామని పలువురు మహిళా వక్తలు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలకు నిరసనగా 'మహిళా ఆక్రోశం' పేరిట సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మహిళలపై జరిగిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసిందన్నారు. మణిపూర్ ఘటన దేశచరిత్రలో ఒక మాయనిమచ్చగా మిగిలిపోతుందన్నారు. ఇలాంటి సంఘటలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గళం విప్పాలన్నారు. కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని కట్టబెట్టడానికి కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. ఈ దురాగతాలకు వ్యతిరేకంగా క్రిస్టియన్లు, ముస్లింలు, దళితులు, ఆదివాసులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ ఒక మనిషిని మరో మనిషి ద్వేషించని సమాజం, ఒక జాతి మరోజాతిపై దాడి చేయని సమాజం కోసం, ప్రజాస్వామిక దేశ నిర్మాణం కోసం ఐక్యం కావాలని అన్నారు. ప్రజా కళాకారుడు వన్నాడ అంజయ్య తన పాటలతో అలరించారు. అనంతరం సమూహ ఆవిర్భావ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. సభలో మహిళా సంఘాల ప్రతినిధులు ఖాలిదా పర్వీన్, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి శ్రీదేవి, ఐద్వా అధ్యక్షురాలు పద్మ,, హాఫీసా తస్లీం ఫర్జానా, ఫాతిమా, మేరిగ్రేస్, హల్దా పురుషోత్తం, మేరి మనోహర్, సామాజిక వేత్త హనీఫ్ అహ్మద్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, సుందర్‌పాల్, హాజీ సలీం, అహ్మద్, గయాజ్, వెంకటేశ్, ఖాజా నిజాముద్దీన్, ఆనంద్, జంబులయ్య, చంద్రయ్య, జక్క గోపాల్ పాల్గొన్నారు.

ఎన్నికల కోసమే జిమ్మిక్కులు

- ఎమ్మెల్యే మర్రి మాటమీద నిలబడాలి: నాగం

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్ర అసెంబ్లీలో ప్రజల సంక్షేమం కోసం ఫలవంతమైన చర్చ జరగాల్సింది పోయి, ప్రతిపక్షాలను అవహేళన చేసేందుకే ప్రభుత్వం, సమావేశాలను నిర్వహించిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. తోటి శాసనసభ్యులపై కనీస గౌరవం లేకుండా మంత్రి కేటీఆర్ సెటైర్లు వేస్తున్నారని, దమ్ముంటే తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన యువనేత కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డితో కలసి నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో మంగళవారం ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాల్వలు లేకుండా ప్రాజెక్టులు కట్టడం సీఎం కేసీఆర్‌కే చెల్లిందని అన్నారు. రూ.వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకు పనికిరాకుండా పోయిందని ప్రశ్నించారు. తనలాంటి వాడు అసెంబ్లీలో ఉంటే సీఎం కేసీఆర్ ఆటలు సాగేవి కావన్నారు. వచ్చే అసెంబ్లీలో కాళేశ్వరం పేరిట దండుకున్న అవినీతి సొమ్మునంతా కక్కిస్తానని చెప్పారు. ఉమ్మడి ఏపీలోనే నాగర్‌కర్నూల్ అంటే నాగం జనార్దన్‌రెడ్డి అనేవారని, ఇప్పుడు మర్రి జనార్దన్‌రెడ్డిని నల్లమట్టి జనార్దన్‌రెడ్డిగా ప్రజలు పిలుచుకుంటున్నారని అన్నారు. సరిగ్గా ఎన్నికల ముందే రూ.5కే భోజనం పెడతామంటూ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి సిద్ధమవుతున్నారని, ఇన్నాళ్లు ఏమైందని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఒక్కపూట కూడా భోజనం పెట్టలేదన్నారు. మున్సిపాలిటీలో అన్ని పనులకు కాంట్రాక్టులు ఇద్దరు వ్యక్తులకే ధారాదత్తం చేస్తున్నారని, ఒక్క టెండర్‌లోనూ పారదర్శకత లేదని విమర్శించారు. కేవలం ఆరు నెలల్లోనే మార్కండేయ ప్రాజెక్టును పూర్తి చేస్తామని, లేకుండా ఓట్లు అడగకుండా నాగంకు మద్దతుగా ప్రచారం చేస్తానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గతంలోనే సవాలు విసిరారని చెప్పారు. ఎమ్మెల్యే తన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. రాష్ట్రానికి కృష్ణాజలాలను దక్కించుకోవాలంటే తనలాంటి వారు శాసనసభలో ఉండాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, అర్థం రవి, కోటయ్య, బాలాగౌడ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగం జనార్దన్‌రెడ్డి